తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శనివారం-24 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 236 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# ఏడు గంటల పాటు సుదీర్ఘ విచారణ

- కేటీఆర్ తొలి రోజు సిట్ విచారణ ముగింపు
- జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి తెలంగాణ భవన్‌కు కేటీఆర్
- 2024లో నమోదైన కేసు నేపథ్యం

**హైదరాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**
ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు తొలి రోజు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు ఏడు గంటల పాటు కేటీఆర్‌ను విచారించారు. ఈ సందర్భంగా ఆయన వాంగ్మూలాన్ని సిట్ నమోదు చేసింది.
విచారణ పూర్తైన అనంతరం కేటీఆర్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి నేరుగా తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. విచారణ సమయంలో పలు అంశాలపై అధికారులు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కేటీఆర్ పూర్తి స్థాయిలో సహకరించినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలతో 2024 మార్చిలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది.

మిగతా 2లో

# సిట్ విచారణపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

## సిట్ విచారణకు భయమేదీ లేదు: కేటీఆర్

- 'ప్రజల దృష్టి మళ్లించేందుకే సాగదీత'
- ఏడు గంటల విచారణలో స్పష్టత లేదు
- ఒకే ప్రశ్నలు మళ్లీ మళ్లీ అడిగారు
- 300 పేర్లు చదివి టైంపాస్ చేశారన్న ఆరోపణ
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే యత్నం
- పోలీసు వ్యవస్థను సీఎం దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శ
- ఫోన్ ట్యాపింగ్ అంశం విచారణలో బయటపడిందన్న కేటీఆర్
- లీకుల కథనాలకు బాధ్యులు ఎవరో చెప్పాలన్న డిమాండ్
- మీడియా కథనాలపై సిట్ చేతులు దులుపుకుందన్న ఆరోపణ
- కాంగ్రెస్ నేతల ఆరోపణలపై చర్యలేమిటని ప్రశ్న



**హైదరాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**
'సిట్ అధికారులు నన్ను ఏ కారణంతో పిలిచారో తెలియదు. అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ అడిగారు. సిట్ విచారణకు భయపడేదే లేదు. ఎన్నిసార్లు పిలిచినా వెళ్లేందుకు సిద్ధం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు స్పష్టం చేశారు.

మిగతా 2లో



# హైకోర్టు జడ్జితో సీనియర్ లాయర్ వాగ్వాదం..

- హైకోర్టు ధిక్కరణ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం..!
- విద్యుత్ బిల్లు కేసే వాగ్వాదానికి కారణం.. న్యాయస్థానంలో ఉద్రిక్తత
- క్షమాపణలు చెబితే పరిగణనలోకి తీసుకోండి.. హైకోర్టుకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు) ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తితో జరిగిన వాగ్వాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ వ్యవహారంలో సీనియర్ న్యాయవాది మహేశ్ తివారీపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. హైకోర్టు ఇచ్చిన ధిక్కార నోటీసులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను

7లో



# రూ.2 లక్షల లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ పట్టుబాటు

- ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ ఏసీబీ ట్రాప్ ఆపరేషన్

ఆదిలాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు): ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కటకం విద్యాసాగర్ రెడ్డి లంచం తీసుకుంటూ తెలంగాణ అవినీతినిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఫిర్యాదుధారుని పేరిట 8.35 ఎకరాల భూమికి సంబంధించిన

2లో

# ఏస్-టెక్ హైదరాబాద్ 2026 ప్రారంభం

## ప్రదర్శనను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి


- 'తెలంగాణ రైజింగ్ 2047'తో స్పష్టమైన ప్రభుత్వ దృష్టి
- మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ప్రపంచ స్థాయి మౌలిక వసతుల నిర్మాణంపై ఫోకస్
- ప్రాంతీయ రింగ్ రోడ్‌ను 39 రేడియల్ రహదారులతో అనుసంధానం
- ఐటీ, ఏఐ, ఔషధ, నిర్మాణ రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా హైదరాబాద్
- పట్టణ–గ్రామీణ సమతుల్య అభివృద్ధికి కట్టుబాటు
- కాలుష్యరహిత, సుస్థిర భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

2లో



# ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఎందుకు లేవు?

## కాంగ్రెస్ సర్కారుపై బండి సంజయ్ విమర్శలు



2లో



# అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధులతో మోదీ భేటీ

- కేరళ ప్రగతిపై విస్తృత చర్చ
- మత్స్యకారుల సంక్షేమానికి ప్రశంసలు
- మత్స్య రంగ అభివృద్ధికి కొనసాగనున్న కృషి

**తిరువనంతపురం, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధి బృందంతో సానుకూలంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. మత్స్యకారుల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో ఈ సంస్థ చేస్తున్న సేవలను మోదీ ప్రశంసించారు.
మత్స్యకారుల సంక్షేమం కోసం అఖిల కేరళ ధీవర సభ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అని మోదీ పేర్కొన్నారు. సముద్ర ఆధారిత జీవన విధానంపై

మిగతా 2లో

# సింగరేణి టెండర్లలో భారీ కుంభకోణాలు

- ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్ నోటీసులన్న విమర్శ
- సింగిల్ టెండర్‌తో వందల కోట్ల అక్రమాలకు మార్గం
- ఒత్తిడితో డైరెక్టర్ రాజీనామా, అధికారులపై చర్యలు
- అన్ని టెండర్లపై కేంద్ర దర్యాప్తు కోరిన హరీశ్‌రావు



**హైదరాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీప బంధువు కోసమే సింగరేణిలో భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. సోలార్ పవర్, ఎక్స్‌ప్లోజింగ్, ప్రకాశం ఖని, శ్రీరాంపూర్ ఓబీల్లోనూ స్కాంలు జరిగాయన్నారు.

మిగతా 2లో



# తెలంగాణ జాగృతిలో చేరిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

సిద్ధిపేటకు చెందిన ఎస్. శ్రీనివాస్ నేతృత్వంలో మిట్టపల్లి బృందం చేరిక

8లో

# ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రమైంది

## కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి: మహేశ్‌కుమార్ గౌడ్

- టెలిగ్రాఫ్ చట్టం చదివితే కేసు తీవ్రత తెలుస్తుందన్న వ్యాఖ్య
- సిట్ విచారణలో ప్రమేయం తేలితే జైలు తప్పదని హెచ్చరిక
- కేసీఆర్ కుటుంబంపై దోపిడీ ఆరోపణలు
- బీఆర్ఎస్–బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందమన్న విమర్శ

**హైదరాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**
ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రమైనదని, ఈ కేసును తెలంగాణ ఉద్యమ కేసులతో పోల్చడం సరి కాదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ట్యాపింగ్ కేసు ఎంత తీవ్రమైనదో టెలిగ్రాఫ్ చట్టం చదివితే తెలుస్తుందని.. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.





# కేరళ అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ కీలక సన్నాహక సమావేశం

రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న భేటీ

**తిరువనంతపురం, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**
కేరళలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కీలక సన్నాహక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే పాల్గొని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. సుమారు 3.6 కోట్ల మంది కేరళ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు యూడీఎఫ్ భాగస్వామ్య పక్షాలు కలిసి ప్రగతిశీల, అభివృద్ధి ప్రధాన, సంక్షేమాధారిత పాలన అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని స్పష్టం చేశారు.

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కల్లు తాగిన కోతుల్లా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తించారు

- కాంగ్రెస్ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నా
- మద్యం మత్తులో వచ్చి నా మీద దాడికి ప్రయత్నించారు
- అభివృద్ధిపై రౌడీయిజం చేశారంటే ఇక ప్రజలు ఊరుకోరు
- జనగామ ప్రశాంతతను చెడగొట్టే శక్తులను ప్రజలే తిప్పికొడతారు
- గుండాలతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు
- రాబోయే ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే
- ఇటువంటి పిచ్చి పనులు మానుకోండి
- శాంతి భద్రతకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుల రెచ్చగొట్టే ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నా
- జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి



**జనగామ,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):**

జనగామ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క చేతుల మీదుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో కావాలనే గందరగోళం సృష్టించి, మద్యం మత్తులో వచ్చి తనపై దాడికి యత్నించారని ఆరోపించారు. కాంగ్రెస్ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నానని, ఇటువంటి రౌడీయిజం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, జనగామ ప్రశాంతతను చెడగొట్టే శక్తులను ప్రజలే తిప్పికొడతారని హెచ్చరించారు. గుండాలతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని, ఇటువంటి పిచ్చి పనులు మానుకోవాలని హితవు పలికారు. అభివృద్ధిపై రౌడీయిజం చేశారంటే ఇక ప్రజలు ఊరుకోరని స్పష్టం చేశారు.

ప్రోటోకాల్ ప్రకారం మంత్రి సీతక్క చేతుల మీదుగా జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు అధికారిక ఆహ్వానం అందిందని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొని, మంత్రి సీతక్కకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికామని చెప్పారు. అయితే, అక్కడ ఉన్న కొంతమంది కాంగ్రెస్ నాయకులు కావాలనే కొబ్బరి కాయ కొట్టే సమయంలో గందరగోళం సృష్టించారని విమర్శించారు. కొందరు మద్యం మత్తులో వచ్చి, 'ఎమ్మెల్యే పల్లా గో బ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని భంగపెట్టే ప్రయత్నం చేశారని, తనపై దాడికి కూడా యత్నించారని ఆరోపించారు. కల్లు తాగిన కోతుల్లా ప్రవర్తించారని, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుల రెచ్చగొట్టే ప్రవర్తనను తీవ్రంగా హెచ్చరిస్తున్నానని పేర్కొన్నారు.

వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ పనులు నాలుగేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.7 కోట్ల వ్యయంతో ప్రారంభమయ్యాయని, రెండేళ్లు నిలిచిపోయినా గత ఆరు నెలలుగా తాను పర్యవేక్షించి పూర్తి చేయించామని ఎమ్మెల్యే వివరించారు. బతుకమ్మ కుంట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదని, మున్సిపాలిటీకి వచ్చిన ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి సుమారు రూ.3 కోట్లు వెచ్చించి పూర్తి చేశామని తెలిపారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కేటీఆర్ సహకారంతో వైకుంఠధామ అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయించానని, కానీ కాంగ్రెస్ నాయకుల అడ్డంకుల వల్ల రూ.19 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని చెప్పారు. అందులో భాగంగా వైకుంఠధామానికి రూ.2 కోట్లు, నెహ్రూ పార్క్ సమీపంలోని 60 అడుగుల రోడ్డుకు పనులు ప్రారంభించామని తెలిపారు.

జనగామ అభివృద్ధి కోసం గానుపహాడు బ్రిడ్జికి రూ.90 లక్షలు, చిటకోడూరు బ్రిడ్జికి నిధులు, అందెశ్రీ పుట్టిన రెబర్తి ప్రాంతానికి అదనపు నిధులు, మినీ సమ్మక్కసారలమ్మ జాతరకు ప్రత్యేక నిధులు కోరుతూ వినతిపత్రాలు అందించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొమ్మూరి ప్రతాపరెడ్డి కొడుకు ఆధ్వర్యంలో జరిగిన ఈ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, కావాలనే మద్యం తాగించి గొడవలు చేయడం జనగామ ప్రజలు సహించరని చెప్పారు. మా కార్యకర్తలు, నాయకులు నిదానంగా వ్యవహరించి, మంత్రి సీతక్కకు గౌరవం ఇచ్చి శాంతియుతంగా కార్యక్రమాలు పూర్తి చేశామని తెలిపారు.

జనగామ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇటువంటి చిల్లర రాజకీయాలను సహించరని ఎమ్మెల్యే అన్నారు. శాంతి భద్రతకు విఘాతం కలిగించిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జనగామకు చెందినవారు అసలు కాదని, జనగామ ప్రజలే మొత్తం చూశారని, ఎవరు రెచ్చగొట్టారో, ఎవరు అభివృద్ధి చేశారో తెలుసని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల తీర్పు స్పష్టంగా ఉంటుందని, ఎగిరేది గులాబీ జెండానే అని డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సంఘటనలు జనగామలో రాజకీయ ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి, ప్రజలు అభివృద్ధి మరియు శాంతిని కోరుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై దాడికి యత్నం సిగ్గుచేటు

## మాజీ డిప్యూటీ సిఎం డాక్టర్ తాటికొండ రాజయ్య

**జనగామ,జనవరి23 (తెలంగాణ ముచ్చట్లు):** జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై దాడికి యత్నం సిగ్గుచేటు అని మాజీ డిప్యూటీ సిఎం డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి పై జరిగిన దాడికి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. మంత్రి సీతక్క సమక్షంలోనే ఇలాంటి ఘటన జరగడం అత్యంత సిగ్గుచేటు అని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.

ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసినా పోలీసులు స్పందించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన డాక్టర్ తాటికొండ రాజయ్య, పోలీసు వ్యవస్థ ఎవరి కోసం పని చేస్తుందో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అనే గౌరవాన్ని కూడా పట్టించుకోకుండా మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు దాడికి యత్నించడం సమాజానికి తలదించుకునే పరిస్థితిగా మారిందని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన



చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జనగామలో మంత్రి సీతక్క చేతుల మీదుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కావాలనే గందరగోళం సృష్టించి, మద్యం మత్తులో వచ్చి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పై దాడికి యత్నించారని ఎమ్మెల్యే తమ ఆరోపణలు గుర్తుచేస్తూ, ఈ ఘటన రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచుతోందని స్థానికులు చెబుతున్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల అసంతృప్తి పెరుగుతున్న మధ్య, ఈ డిమాండ్‌లు రాష్ట్రవ్యాప్తంగా

# ఏడు గంటల పాటు సుదీర్ఘ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి నుంచి ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.సజ్జనార్ నేతృత్వంలో సిట్ దర్యాప్తు ఈ కేసును ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. కేసు దర్యాప్తులో భాగంగానే కేటీఆర్‌ను తాజాగా సిట్ ప్రశ్నించింది. అవసరమైతే తదుపరి దశలో మరిన్ని విచారణలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు సూచించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఎందుకు లేవు?

**హైదరాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఫోన్ ట్యాపింగ్‌తోపాటు అనేక అక్రమాలకు పాల్పడిన కేసీఆర్ కుటుంబసభ్యులను అరెస్టు చేసే దమ్ము కాంగ్రెస్ సర్కారుకు లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ సీరియల్‌లా కొనసాగుతూనే ఉంది. సిట్ అధికారులకు ప్రభుత్వం స్వేచ్ఛనివ్వడం లేదు. కొందరు పెద్దలు ఎవర్ని పిలవమని చెబితే వారినే పిలిచి విచారిస్తున్నారు. కేటీఆర్‌ను ఎందుకు విచారణకు పిలిచారు? ఫోన్లు ట్యాపింగ్ చేయించినందుకా? లేక ఆయన ఫోన్ కూడా ట్యాప్ అయిందని చెప్పడానికా? భారాస హయాంలో కేటీఆర్ ఆడిందే ఆటగా ఫోన్ ట్యాపింగ్ చేయించారు. అలాంటి వ్యక్తిని సాక్షిగా పిలిచి వాంగ్మూలం నమోదు చేయడమేంటి? రెండేళ్ల సిట్ విచారణలో సాధించిందేమిటి? స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ కూతురు కవిత తమ ఫోన్లు ట్యాప్ చేశారని చెప్పారు. ఇన్ని సాక్ష్యాధారాలు ఉన్నా ఎందుకు ఎవరినీ అరెస్టు చేయడంలేదు? విచారణ తమతో కాదని, సీబీఐతో జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాస్తే చర్యలకు సిద్ధం అని స్పష్టం చేశారు.

# సిట్ విచారణపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో సుమారు ఏడు గంటలపాటు సాగిన సిట్ విచారణ అనంతరం కేటీఆర్ శుక్రవారం రాత్రి తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'సిట్ అధికారులు ఒక టీవీ సీరియల్ తరహాలో సాగదీత ధోరణిలో ప్రశ్నలు వేసి 300 పేర్లు చదివి వారు తెలుసా అని అడిగారు. విచారణ పేరిట గంటలకొద్దీ టైంపాస్ చేయడం మినహా వేరే విషయమంటూ లేదు' అని కేటీఆర్ మండిపడ్డారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే..'గత రెండేళ్లుగా ప్రభుత్వ అసమర్థత, పాలనా వైఫల్యాలు, అవినీతిని బీఆర్ఎస్ నాయకత్వం నిత్యం ఎండగడుతుండటంతో ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం రేవంత్ పోలీసు వ్యవస్థను వాడుకుంటున్నాడు. ఏదో ఒక కథను సృష్టించి ప్రజలను భ్రమింప చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఎవరినో పక్కనపెట్టి నన్ను విచారణ చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదు. సిట్ విచారణలో కేటీ రామారావు తప్ప ఇంక ఏ రావూ లేదు. మంత్రులతోపాటు మా ఫోన్లు కూడా ప్రస్తుతం ట్యాప్ అవుతున్నాయని ఈరోజు జరిగిన విచారణలో బయటపడింది' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

లీకుల పేరిట కథనాలకు బాధ్యులెవరు? 'రెండేళ్లుగా లీకులిస్తూ మీడియాలో వచ్చే కథనాలతో మా పార్టీ నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడింది ఎవరని సిట్ అధికారులను ప్రశ్నిస్తే.. మీడియా రాస్తే మాకేం సంబంధం అంటూ సిట్ చేతులు దులుపుకుంది. విచారణ పేరిట లీకులివ్వడం మంచి పద్ధతి కాదని చెప్పా. యూట్యూబ్ చానళ్లు, మీడియాలో వస్తున్న వార్తలు వాస్తవమైతే సమాచారం ఎవరిచ్చారో చెప్పాలని అడిగా. లీకుల పేరిట నడిపిన కథనాలు, మా కుటుంబాలకు, మాకు కలిగిన క్షోభ, మా వ్యక్తిత్వ హననం దృష్ట్యా లీకులను నిరోధించాలని కోరా. ప్రభుత్వం ఇచ్చే లీకుల ఆధారంగా వార్తలు రాయొద్దని మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నా. మా ఎమ్మెల్యేలు, మా నాయకుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయో లేదో చెప్పాలని సిట్ అధికారులను అడిగితే సంబంధం లేదని నీళ్లు నములుతున్నారు. ఓ మంత్రి కూడా ఆయన ఫోన్ ట్యాప్ అవుతోందంటూ చేసిన వ్యాఖ్యలపైనా సిట్ అధికారులు తప్పించుకునే ధోరణిలో సమాధానం ఇచ్చారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. సింగరేణి టెండర్ల కుంభకోణంతోపాటు కాంగ్రెస్ మంత్రులు, నేతలపై వస్తున్న ఆరోపణలపై చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని ఆయన ప్రశ్నించారు.

# ఏస్-టెక్ హైదరాబాద్ 2026 ప్రారంభం

**హైదరాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

హైటెక్స్ వేదికగా నిర్వహిస్తున్న ఏస్-టెక్ హైదరాబాద్ 2026 ప్రదర్శనను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ 2047" అనే స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతోందని తెలిపారు. దేశంలోనే కాదు, ప్రపంచ స్థాయిలో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయి మౌలిక వసతుల నిర్మాణమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి వివరించారు. ప్రాంతీయ రింగ్ రోడ్డును 39 రేడియల్ రహదారులతో అనుసంధానించి రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధిని సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఐటీ, కృత్రిమ మేధస్సు, ఔషధ, నిర్మాణ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నగరం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా వేగంగా ఎదుగుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అదే సమయంలో పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలు తగ్గేలా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. చౌక గృహ నిర్మాణం, ఉపాధి అవకాశాల సృష్టి, సుస్థిర అభివృద్ధి ద్వారా కాలుష్యరహిత భవిష్యత్తును నిర్మించడమే లక్ష్యమని తెలిపారు.

ఏస్-టెక్ ప్రదర్శనలో జరిగిన ప్యానల్ చర్చలో కాలుష్యరహిత నగర నిర్మాణంపై వచ్చిన సూచనలను కేబినెట్ ముందు ఉంచుతామని మంత్రి వెల్లడించారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని ఆయన స్పష్టం చేశారు.

# సింగరేణి టెండర్లలో భారీ కుంభకోణాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవహారాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్‌లో తనకు, కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. అన్ని అక్రమాలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి రాసిన లేఖను హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సింగరేణి టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికేషన్‌తో కుంభకోణం బయటపడింది. గతంలో యూపీఏ ప్రభుత్వాన్ని బొగ్గు కుంభకోణం ఎలా దెబ్బతీసిందో.. రేవంత్ ప్రభుత్వ పతనానికి కూడా ఈ కోల్ స్కాం బీజం వేసింది. సింగరేణిలో సోలార్ పవర్‌లోనూ కుంభకోణానికి తెరలేపారు. తమ అనుయాయులకు మూడు వేర్వేరు సైట్లలో సోలార్ పవర్ ప్లాంట్లను కట్టబెట్టడానికి.. మూడింటికి కలిపి 107 మెగావాట్లతో సింగిల్ టెండర్ పిలిచారు. ఇందులోనూ ఎంఎస్‌ఎంఈలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనకుండా.. సైట్ విజిట్ సర్టిఫికెట్ కండిషన్ పెట్టారు. రామగుండంలో జరిగిన ఈ స్కాంలో.. తమకు అనుకూల సంస్థకు రూ.250 కోట్లు అదనంగా వచ్చేలా టెండర్‌ను అప్పగించారు. మరో 67 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లోనూ ఇదే విధంగా మరో రూ.250 కోట్ల అక్రమాలకు తెగబడ్డారు.

**ఒత్తిడి చేయడంతో డైరెక్టర్ రాజీనామా..**

సింగరేణిలో జిలెటిన్ స్టిక్స్ కొనుగోలులో 30 శాతం రేటు అదనంగా పెట్టి కొనాలని ఒత్తిడి చేయడంతో.. ఒక డైరెక్టర్ రాజీనామా చేశారు. మరో డైరెక్టర్ కూడా దీనికి నిరాకరిస్తే.. ఆయన్ను జీఎం పదవికి రివర్స్ చేశారు. ఫీల్డ్ విజిట్ నిబంధనతోనే ప్రకాశం ఖనికీ రూ.1,044 కోట్లతో టెండర్‌ను పిలిచారు. మరి ఈ నిబంధన ఒక టెండర్‌లో తప్పు అయినప్పుడు.. ఇక్కడ కూడా తప్పే కదా? వెంటనే ప్రకాశం ఖని టెండర్‌ను కూడా రద్దు చేయాలి. శ్రీరాంపూర్ ఓబీల్లో రూ.600 కోట్ల పనులకు టెండర్ పిలిచారు. టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసి.. ఫైనాన్షియల్ బిడ్ కోసం ఏడుసార్లు డేట్ ఇచ్చి వాయిదా వేశారు. సీఎం సమీప బంధువు కోసమే ఇలా వాయిదా వేశారు. ఈ అన్ని టెండర్లను రద్దు చేయాలి. కాంగ్రెస్, భాజపాల మధ్య చీకటి బంధం లేకపోతే.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారణకు ఆదేశించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధులతో మోదీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఆధారపడిన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తోందని మోదీ వెల్లడించారు. మత్స్య ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. రానున్న కాలంలో మరింత ఉత్సాహంతో మత్స్య రంగ అభివృద్ధికి చర్యలు కొనసాగిస్తామని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. మత్స్యకారుల ఆదాయం పెంచడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మోదీ తెలిపారు.

# కేరళ అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ కీలక సన్నాహక సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ఉపాధి కల్పన, సామాజిక న్యాయం, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. కేరళలో ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేలా క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠం చేయాలని రాహుల్ గాంధీ సూచించినట్లు సమాచారం.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, యూడీఎఫ్ ప్రభుత్వమే కేరళకు స్థిరమైన, బాధ్యతాయుత పాలన అందించగలదని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఆశయాలను ప్రతిబింబించే కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రమైంది

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మార్పు ఉండబోదన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ఆమెను మారుస్తారని తాను అనుకోవట్లేదని చెప్పారు. కవిత కొత్త పార్టీ పెడితే స్వాగతిస్తామన్నారు. కవిత కాంగ్రెస్‌లో చేరనున్నారన్న ప్రచారంపై స్పందిస్తూ.. ఒకవేళ ఆమె వచ్చినా పార్టీలోకి తీసుకోవద్దంటూ అధిష్ఠానానికి తన అభిప్రాయంగా చెప్పినట్లు వెల్లడించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మహేశ్ గౌడ్ చిట్‌చాట్ చేశారు. నిబంధనల ప్రకారం విచారణ జరుగుతుంటే వ్యక్తిత్వ హననం చేస్తున్నారంటూ కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సిట్ విచారణలో ఆయన ప్రమేయం ఉన్నట్లు తేలితే జైలు తప్పదని వ్యాఖ్యానించారు. తోడబుట్టిన చెల్లెలే తన భర్త ఫోన్‌నూ ట్యాప్ చేశారని చెబుతుంటే.. కేటీఆర్, హరీశ్‌రావు దగ్గర్నుంచి సమాధానం లేదన్నారు. సిట్ విచారణకు కవితను, ఆమె భర్తనూ పిలవాలన్నారు.

**దొంగల మాదిరి కేసీఆర్ కుటుంబ దోపిడీ..**

పదేళ్ల పాలనలో ఆలీబాబా 420 దొంగల మాదిరిగా కేసీఆర్ కుటుంబం దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ అన్నారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే శక్తులకు సంబంధించిన ఫోన్లను మాత్రమే ట్యాప్ చేసేందుకు వీలుంటుందని చెప్పారు. నక్సలైట్లతో సంప్రదింపులు జరుపుతున్నానని ఆరోపిస్తూ తన ఫోన్‌నూ ట్యాప్ చేశారని వెల్లడించారు. కేసీఆర్ కుటుంబంలో తగదాలకు మూలం వాటాల పంపకాల్లో తేడాలేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిలో పారదర్శకత పెరిగిందని తెలిపారు. సిట్ విచారణ లోతుగా జరుగుతున్నందునే జాప్యం జరుగుతోందన్నారు. విచారణ టీవీ సీరియల్‌లాగా కొనసాగుతోందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. కాళేశ్వరం అవినీతికి సంబంధించి కేసీఆర్ కుటుంబంపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నట్లు వస్తున్న వార్తలపై వివరాలివ్వాలని స్థానిక నాయకత్వానికి సూచించినట్లు చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఏమీ పాల్పడలేదని స్పష్టం చేశారు.

# రూ.2 లక్షల లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ పట్టుబాటు

- ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ ఏసీబీ ట్రాప్ ఆపరేషన్

**ఆదిలాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కటకం విద్యాసాగర్ రెడ్డి లంచం తీసుకుంటూ తెలంగాణ అవినీతినిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఫిర్యాదుధారుని పేరిట 8.35 ఎకరాల భూమికి సంబంధించిన సాదా బైనామా రిజిస్ట్రేషన్ ఫైల్‌ను ప్రాసెస్ చేసి ముందుకు పంపేందుకు రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సమయంలో ఈ ట్రాప్ ఆపరేషన్ జరిగింది. ఫిర్యాదు అందిన వెంటనే తెలంగాణ ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేసి, లంచం తీసుకుంటున్న సమయంలో నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ సేవకులు ఎవరైనా లంచం అడిగినట్లయితే ప్రజలు తప్పకుండా ఫిర్యాదు చేయాలని తెలంగాణ అవినీతినిరోధక శాఖ విజ్ఞప్తి చేసింది. లంచం డిమాండ్ చేసిన సందర్భాల్లో టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు డయల్ చేయాలని సూచించింది. అలాగే వాట్సాప్ 9440446106, వెబ్‌సైట్ acb.telangana.gov.in ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది.

ఫిర్యాదుధారులు, బాధితుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు భరోసా ఇచ్చారు. అవినీతిపై ప్రజలు నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శనివారం - 24 - జనవరి 2026


# ఉప్పల్ లో పెద్ద నాలా నుంచి మూసీ వరకు అవుట్‌లెట్ నిర్మాణానికి చర్యలు

◆ వరద ముప్పు నుంచి కాలనీలకు శాశ్వత పరిష్కారం



**ఉప్పల్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ ప్రాంత ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. ఉప్పల్ లో పెద్ద నాలా నుంచి భగాయత్‌లోని హెచ్ఎండీఏ లే అవుట్ మీదుగా మూసీ నదికి అవుట్‌లెట్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ అవుట్‌లెట్ నిర్మాణం పూర్తయితే ఉప్పల్‌లోని పలు కాలనీలకు ప్రతి వర్షాకాలంలో ఎదురయ్యే వరద ముప్పు పూర్తిగా తొలగిపోతుందని ఆమె తెలిపారు.అవుట్‌లెట్ ద్వారా నాలాలోని వర్షపు నీరు నేరుగా మూసీకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయనున్నారని, దీంతో శాంతి నగర్, న్యూ శాంతి నగర్, సత్యనగర్, న్యూ విజయపురి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే సమస్యకు చెక్ పడుతుందన్నారు. వరదల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులు, ఆస్తి నష్టం నివారించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఉప్పల్ పోచమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తో కలిసి కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. పనుల నాణ్యత, వేగం, భద్రతా ప్రమాణాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఉప్పల్ డివిజన్‌లో డ్రైనేజీ, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని కార్పొరేటర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్ణీత గడువులో కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్‌తో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే ఉప్పల్ ప్రాంతం వరద రహితంగా మారడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సరస్వతి పూజా కార్యక్రమంలో పాల్గొన్న నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** వసంత పంచమి సందర్భంగా మల్లాపూర్ బంగీయ సంఘం ఆధ్వర్యంలో నాచారం సర్కిల్ మల్లాపూర్ వి.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించిన సరస్వతి పూజా కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్య, జ్ఞానం, సృజనాత్మకతకు ప్రతీక అయిన సరస్వతి దేవి కృపతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ కమిటీ సభ్యులతో పాటు ప్రదీప్, కొయలకొండ రాజేష్, దాసరి సాయి, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆధార్ సేవల్లో దమ్మపేటకు జిల్లా గుర్తింపు

◆ మెగా క్యాంపుల నిర్వహణపై కలెక్టర్ ప్రశంసలు.





**దమ్మపేట, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** మెగా ఆధార్ క్యాంపుల నిర్వహణ ద్వారా ప్రజలకు విశేష సేవలు అందించినందుకు దమ్మపేట మండలానికి చెందిన మీసేవ కేంద్ర నిర్వాహకులకు జిల్లా స్థాయి గుర్తింపు లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మీసేవ కేంద్ర సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో దమ్మపేట మండలానికి చెందిన ఆధార్ సూపర్‌వైజర్ బెల్లంకొండ రామారావు, ఆధార్ ఆపరేటర్ దుర్గ మెగా ఆధార్ క్యాంపుల ద్వారా సమర్థవంతమైన సేవలు అందించినందుకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరాలంటే మీసేవ కేంద్రాల పాత్ర కీలకమని అన్నారు. ఆదాయ, కుల, నివాస, జనన-మరణ ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల మంజూరు, వివిధ ప్రభుత్వ పథకాల దరఖాస్తుల స్వీకరణ, ఆధార్ నమోదు-సవరణ వంటి సేవల్లో మీసేవ కేంద్రాలు ప్రజలకు తొలి సంప్రదింపు కేంద్రాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. మెగా ఆధార్ క్యాంపుల ద్వారా వేలాది మందికి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరిన కలెక్టర్, ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా మీసేవ కేంద్రాలు పనిచేయాలని స్పష్టం చేశారు.

# మహిళల స్వయం ఉపాధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం నెమలి అనిల్ కుమార్




**మల్లాపూర్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు ఆత్మగౌరవంతో నిలబడి, స్వయం ఉపాధితో ముందుకు సాగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలిపారు. మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మల్లాపూర్ డివిజన్‌లోని మైనారిటీ మహిళా లబ్ధిదారులకు ఉచిత కుట్టు మెషిన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ,"మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం. గతంలో ఇప్పటికే 30, అనంతరం మరో 20 కుట్టు మెషిన్లను అందజేసి మహిళలకు అండగా నిలిచాం. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళా సోదరీమణుల ముఖాల్లో కనిపించిన ఆనందమే మా రాజకీయ ప్రయాణానికి నిజమైన బలం" అని అన్నారు.మల్లాపూర్ డివిజన్‌లోని ప్రతి అర్హుడైన కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచేలా నిరంతరం పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జమీలా బేగం, ఇష్రత్ బానో, ఇంటియాజ్ బేగం, కప్పర సాయి, ఎస్.వి. కిట్టు, వి. శ్రీనివాస్, జానీ పాల్గొన్నారు.

# లింగాల సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర బైక్ ప్రమాదం

◆ ఇద్దరు యువకులు మృతి.





**సత్తుపల్లి, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం లింగాల సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే (జాతీయ రహదారి)పై శుక్రవారం ఉదయం ఘోర బైక్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాకు చెందిన కొమ్ము సాయి మహేష్ (35), గట్టు రాంబాబు (39) అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఖమ్మం వైపు బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో అధిక వేగంతో వెళ్తున్న బైక్ అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న రైలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తలపై తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందగానే కల్లూరు 108 అంబులెన్స్ సిబ్బంది అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు పర్వత రవి, వాహన చోదకుడు కటారి ప్రభాకర్ రావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మణిగిల్లలో ఘనంగా ఓటర్ల దినోత్సవం

**పెద్దమందడి,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన బస్టాండ్ ఆవరణలో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువత, పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న పవిత్ర హక్కు అని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు .ఈ కార్యక్రమంలో రాములు, పోతుల రామ్ రెడ్డి, ఊదారు మొగులయ్య, ఉప్పరి బిసన్న, రెండో వార్డు సభ్యులు మధిరాల శ్రీకాంత్ రెడ్డి, సింగం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్

◆ మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి



**పెద్దమందడి,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రఘుపతి రెడ్డి మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్య సాధనలో సుభాష్ చంద్రబోస్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు.నేతాజీ జీవితం, త్యాగాలు, దేశభక్తి యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం. ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది అని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు దేశభక్తి, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు.గ్రామ యువకులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నేతాజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, గ్రామ పెద్దలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బస్టాండ్ ఆవరణలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి బ్రేక్

◆ హైకోర్టులో స్టే సాధించిన అడ్వకేట్ శిరీషకు ఘన సన్మానం.



**అశ్వారావుపేట, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట బస్టాండ్ ఆవరణలో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని చేపట్టాలన్న ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేసి స్టే ఉత్తర్వులు సాధించిన అడ్వకేట్ శిరీషకు శుక్రవారం దమ్మపేటలో ఘన సన్మానం నిర్వహించారు.ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉండే బస్టాండ్ పరిసరాల్లో పెట్రోల్ బంక్ నిర్మాణం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశముందని, ప్రజల భద్రతకు ఇది ముప్పుగా మారుతుందని పేర్కొంటూ ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం పెట్రోల్ బంక్ నిర్మాణంపై స్టే ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దమ్మపేటకు విచ్చేసిన అడ్వకేట్ శిరీషను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ప్రజా సౌకర్యాన్ని కాపాడేందుకు ఆమె చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి, ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సమస్యలపై న్యాయపరంగా పోరాడి న్యాయం సాధించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తంబల్ల రవి (బీజేపీ నియోజకవర్గ నాయకులు), పల్లపు వెంకటేశ్వరరావు (మండల అధ్యక్షులు), భవాని కృష్ణ (బీఆర్ఎస్ నాయకులు, న్యాయవాది), గూడా ముత్యాలరావు, సోయం వెంకట్, పల్లపు శిరీష తదితరులు పాల్గొని అడ్వకేట్ శిరీషను అభినందించారు. ప్రజా భద్రత, ప్రయాణికుల సౌకర్యం దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ప్రజాహిత పోరాటాలు కొనసాగాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# సెరినిటీ స్కూల్ లో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం




**నాగారం, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగారం డివిజన్ సెరినిటీ మోడల్ స్కూల్లో నోముల వసంత జంగారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి సతీ సమేతంగా పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాదని, చిన్నారుల్లో విద్యాపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.వసంత పంచమి రోజున అక్షరాభ్యాసం చేయడం శుభప్రదమని, పిల్లల భవిష్యత్తుకు ఇది మంచి ఆరంభమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మోజర్లలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**పెద్దమందడి,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామ కృష్ణా రెడ్డి గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ తో కలిసి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అవసరమైన కుటుంబానికి సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ముఖ్యమంత్రి కప్ 2025 నిర్వహణకు కీసర మండల స్థాయి కమిటీ ఏర్పాటు





**కీసర, జనవరి 22( తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కప్-2025 (2వ ఎడిషన్) పోటీలను కీసర మండలంలో సజావుగా నిర్వహించేందుకు మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం. జమదగ్నీ తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ కమిటీ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలు చేపడుతుందని ఆయన పేర్కొన్నారు. కమిటీలో మండల రెవెన్యూ అధికారి యాదగిరి రెడ్డి చైర్మన్‌గా, మండల విద్యాశాఖాధికారి ఎం. జమదగ్నీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కీసర ఎస్.ఐ, హరి ప్రసాద్ ,కీసర క్లస్టర్ లెవల్ ఇన్‌చార్జ్ , సీనియర్ ప్లేయర్ సభ్యులుగా నియమించబడ్డారు.ఈ సందర్భంగా జనవరి 23వ తేదీ ఉదయం 10 గంటలకు జెడ్ పి హెచ్ ఎస్ కీసర నుంచి కీసర ఎక్స్ రోడ్ వరకు నిర్వహించనున్న ముఖ్యమంత్రి కప్-2026 టార్చ్ ర్యాలీని విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులందరూ పూర్తి సహకారం అందించాలని మండల విద్యాశాఖాధికారి కోరారు.ముఖ్యమంత్రి కప్ ద్వారా యువతలో క్రీడా నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అభివృద్ధి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు





◆ పేదలకు భోజన ప్యాకెట్ల పంపిణీ

**ఏ.ఎస్.రావు నగర్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఉప్పల్ నియోజకవర్గం డా. ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ పరిధిలోని సౌత్ కమలా నగర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సుమారు 200 మంది పేదలకు భోజన ప్యాకెట్లు (బిర్యానీ) పంపిణీ చేశారు. కార్యకర్తల మనోధైర్యాన్ని పెంపొందిస్తూ ఎల్లప్పుడూ అండగా నిలిచే నాయకుడిగా నారా లోకేష్‌ను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు పాదయాత్ర చేసి పరిష్కార మార్గాలు సూచించిన యువ నాయకుడిగా ఆయనకు విశేష ఆదరణ ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, మాజీ కౌన్సిలర్ గడ్డమిధి రాములు యాదవ్, స్థానిక సీనియర్ నేతలు గొట్టిపాటి వెంకటేశ్వరావు, మొవ్వ శ్రీనివాస కుమార్, బాలాజీ శ్రీను (గరికపాటి శ్రీనివాసరావు), హౌసింగ్ బోర్డ్ బాబాయ్ (నాగేశ్వరావు), వెంకటేశ్వరావు, నాగరాజు, నాగేశ్వరావు, రామకృష్ణ, గోబేరు రమేష్, కోటేశ్వరరావు, సారధి, శేషు, రామ కోటేశ్వరరావు, వెంకన్న, చంటి, నారాయణరావు, రాజేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్ – 2026"లో భాగంగా కీసరలో రోడ్డు భద్రతా అవగాహన






**కీసర, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన "అరైవ్ అలైవ్ - 2026" ప్రాజెక్టు మరియు డీజీపీ మార్గదర్శకత్వంలో, రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా కీసర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో, ఎస్‌ఐలు బి. నాగరాజు, కె. శ్రీనివాస్ చీర్యాల ప్రాంతంలో నిర్వహించారు. పరిశ్రమలకు సంబంధించిన ట్రక్కులు, ట్యాంకర్లు, ఉద్యోగుల బస్సులు, డెలివరీ వాహనాల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అధిక వేగంతో వాహనాలు నడపడం, అలసటతో డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం లేకపోవడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలని అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమల యాజమాన్యం, రవాణా కాంట్రాక్టర్లు, వాహన డ్రైవర్లు, ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, వైద్య నిపుణులు పాల్గొని రోడ్డు భద్రతపై తమ సూచనలు తెలియజేశారు. వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు, డ్రైవర్ల ఆరోగ్య పరీక్షలు, షిఫ్ట్ ఆధారిత డ్రైవింగ్ విధానం, ఫ్యాక్టరీల సమీపంలో వేగ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.రోడ్డు భద్రతను పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతగా భావించి, ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖతో కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

# అంకిరెడ్డిపల్లి ప్రధాన రహదారి రోడ్డు మరమ్మత్తులు పట్టించుకోని అధికారులు

◆ ప్రజల ప్రాణాలతో చెలగాటం – స్థానికుల ఆగ్రహం








**కీసర, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కీసర సర్కిల్ పరిధిలో ఉన్న అంకిరెడ్డిపల్లి ప్రధాన రహదారి మరమ్మత్తులు చేపట్టడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటంతో ఈ మార్గం ద్వారా నిత్యం వందలాది లారీలు, భారీ వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. రహదారి అంతటా ఏర్పడ్డ లోతైన గుంతలు, పగుళ్లు, బయటకు తేలిన రాళ్లు రవాణాను పూర్తిగా అస్తవ్యస్తం చేశాయి. వర్షాకాలంలో ఈ గుంతలు నీటితో నిండిపోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోవడం, ఆటో డ్రైవర్ల వాహనాలు దెబ్బతినడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. వీధి దీపాలు పనిచేయకపోవడం, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, రహదారిపైకి వాలిపోయిన చెట్ల కొమ్మలు ప్రమాదాన్ని మరింత పెంచుతున్నాయి. చీకట్లో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి ఈ ప్రాంతం వచ్చినప్పటికీ, కనీస మౌలిక వసతులు కూడా అందకపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా, రోడ్డు మరమ్మత్తులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసహనం నెలకొంది. "ప్రమాదం జరిగాకే అధికారులు కదులుతారా?" అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.అంకిరెడ్డిపల్లి ప్రధాన రహదారిని వెంటనే మరమ్మత్తులు చేసి శాశ్వతంగా పునరుద్ధరించాలని, గుంతలు పూడ్చి రహదారి విస్తరణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.

# గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసి పని చేద్దాం



◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సర్పంచులు అందరూ పార్టీలకతీతంగా పనిచేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాల్లోని ప్రజలంతా మనవారేనని భావించి సమానంగా సేవలందిస్తేనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.వనపర్తి పట్టణ శివారులోని యువత శిక్షణ కేంద్రంలో నిర్వహించిన సర్పంచుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వివిధ మండలాలకు చెందిన 133 మంది సర్పంచులు ఐదు రోజులపాటు ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న సర్పంచులందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు, మురుగు కాలువల శుభ్రత, విద్యుత్ సమస్యలు వంటి అంశాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో వార్డు సభ్యుల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు.గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, ఆయా శాఖల అధికారులు తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందన్నారు.రైతులకు సంబంధించిన భీమా వివరాలు ముందుగానే నమోదు చేయాలని, భూ వివరాల్లో మార్పులు జరిగిన వెంటనే నవీకరించాలని సూచించారు. తద్వారా ప్రభుత్వ పథకాల అమలులో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. గ్రామాల్లో మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించాలని, భవనాల మంజూరుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచుల గౌరవ వేతనం పెంపు, పదవీకాలం అనంతరం పింఛన్ ఏర్పాటు అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.గ్రామస్థాయిలో కాపలాదారు వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు చెప్పారు.సర్పంచులుగా మీరు అందించే సేవలు ప్రజల మనసుల్లో నిలిచిపోయేలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విధానం అన్యాయమని, పాత విధానంలోనే కొనసాగించాలని కోరుతూ గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని సూచించారు. ఆ తీర్మానాలను తనకు అందజేస్తే కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.ఈ శిక్షణ శిబిరం మొదటి విడతలో 133 గ్రామపంచాయతీల సర్పంచులు పాల్గొనగా, రెండో విడతలో మిగతా గ్రామాల సర్పంచులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.అనంతరం శిక్షణ పూర్తి చేసిన సర్పంచులకు ధ్రువ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా మండలాల అభివృద్ధి అధికారులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలచిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్



**నాచారం, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ బాబానగర్ నుండి హనుమాన్ నగర్ వరకు సుమారు రూ.25 లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా స్థానిక బస్తీవాసులు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందిస్తూ కొత్తగా వేస్తున్న డ్రైనేజీ లైన్‌లోకే మురుగు నీటి కనెక్షన్లు కలపాలని, వర్షపు నీటి లైన్లలోకి డ్రైనేజీ నీరు చేరకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరాజ్, వర్క్ ఇన్స్పెక్టర్ శివ, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, సుజాత, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సీపీ




**ఖమ్మం బ్యూరో, జనవరి 23(తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరు పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న సీపీ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు,. సిసిటిఎన్ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. రౌడీషీటర్లు, హిస్టరీ దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని సెక్టర్ పోలీస్ ఆఫీసర్లకు సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. పాత నేరస్థుల కదలికలను నిఘా పెట్టాలన్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా వసంత పంచమి వేడుకలు..



**సత్తుపల్లి, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం వసంత పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా దేవత సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఏ.జి.ఎం, ప్రిన్సిపల్ యనమల రామ్మూర్తి మాట్లాడుతూ వసంత పంచమి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యలో క్రమశిక్షణ, నిబద్ధతతో ముందుకు సాగితే సరస్వతి దేవి ఆశీస్సులతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఆయన తెలిపారు.

వేడుకల్లో భాగంగా కొత్తగా చేరిన విద్యార్థుల కోసం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి, వారి విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవ భావన పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ వేడుకలు ఆనందంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిఆర్పి పార్టీలో వనపర్తి జిల్లా నుంచి భారీ చేరికలు



- టిఆర్పి వనపర్తి జిల్లా అధ్యక్షులు విజయ్ యాదవ్

**వనపర్తి,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్క బీసీ ముందుకు సాగాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు.శుక్రవారం తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా టిఆర్పి అధ్యక్షుడు డి. విజయ్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు టిఆర్పి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం తీన్మార్ మల్లన్న కార్యాలయంలో నిర్వహించగా, నూతనంగా చేరిన వారికి ఆయన కండువాలు కప్పి సాధనంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధన కోసం టిఆర్పి పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ఏకం కావాలని సూచించారు. బీసీలకు ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.అనంతరం వనపర్తి జిల్లా టిఆర్పి నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా డి. (విజయుడు) విజయ్ యాదవ్‌ను, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పూజారి స్వామిని నియమించారు.గోపాల్పేట మండల అధ్యక్షుడిగా దండు రాములు, కొత్తకోట మండల అధ్యక్షుడిగా కురుమూర్తిని నియమించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఆర్పి రాష్ట్ర అధ్యక్షుడు హరిశంకర్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీదింటి శివవీరు, జిల్లా నాయకులు రమణాచారి, వెంకటేష్, రాము, శ్రీను, చరణ్, చిన్న, శివ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ముగ్గురు మహిళలు అరెస్ట్




- ఇన్స్పెక్టర్ రమేష్

**ఖమ్మం బ్యూరో, జనవరి 23(తెలంగాణ ముచ్చట్లు):** చోరీ కేసులో ముగ్గురు మహిళలు అరెస్ట్ చేసి నట్లు ఇన్స్పెక్టర్ రమేష్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో అంబేద్కర్ సెంటర్లో ఉన్న వెంకటరమణ జువెల్లర్ షాపులో ముగ్గురు మహిళలు వచ్చి చెవికి జుంకాలు చూపించమని అడిగి సదరు జువెలర్స్ యజమానిని మాటల్లో పెట్టి రెండు చెవి జుంకాలు మోసపూరితంగా దొంగతనం చేశారని తెలిపారు. దొంగతనం చేసిన ముగ్గురు మహిళలు శుక్రవారం దొంగతనం చేసిన చెవి ఝుంకాలను అమ్ముదామని మధిర కు రాగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు వారిని చూసి భయపడుతుండగా వారిని ఎస్సై నవిత చెక్ చేయగా వారి దగ్గర అనుమానాస్పదంగా ఉన్నా బంగారు చెవి జుంకాలు ఎవరివి అని అడగ్గా మాది నందిగామ అని చెప్పారు. ఈ బంగారు నగలు అంబేద్కర్ సెంటర్లోని వెంకటరమణ జ్యువెలర్స్ లో దొంగతనం చేసాము అని వారు చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. జ్యువలరీ షాపు యజమానులందరూ నాణ్యమైన సీసీ కెమెరాలు తమ తమ షాప్ లలో, రోడ్డు సైడ్ కవర్ అయ్యే విధంగా అమర్చుకొని దాని నీ తరచుగా పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రమేష్, సబ్ ఇన్స్పెక్టర్స్ కిషోర్ కుమార్,నవిత,ఇతర పోలీస్ స్టేషన్ సిబ్బందిని వైరా ఇంచార్జ్ ఏసీపీ వసుంధర యాదవ్ అభినందించారు.

# వసంత పంచమి సందర్భంగా ఘనంగా అక్షరాభ్యాసం






**నాగారం, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** వసంత పంచమి పుణ్యదినాన్ని పురస్కరించుకుని నాగారం-రాంపల్లి సెరినిటీ పాఠశాలల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వ్యవస్థాపకులు నోముల వసంత మాట్లాడుతూ, వసంత పంచమి రోజు అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లల విద్యాబుద్ధులు వికసించి, భవిష్యత్తులో అమ్మవారి కృపతో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వసంత పంచమి శుభప్రదమైన పుణ్యతిథి అని పేర్కొన్నారు. సరస్వతి దేవి పూజ, మంత్రోచ్ఛారణల ద్వారా విద్యార్థులు మనసులోని కోరికలను అమ్మవారికి చెప్పుకుంటే అవి తప్పకుండా నెరవేరుతాయని అన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరికీ అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు.మాఘమాసంలో వచ్చే వసంత పంచమి వేడుకలు నాగారం సెరినిటీ పాఠశాల రాణీ రుద్రమదేవి ప్రాంగణంలో శ్రీ సుబ్రహ్మణ్యం పంతులు ఆధ్వర్యంలో ముగ్గురు వేదపండితుల మంత్రోచ్ఛారణతో నిర్వహించారు.తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడంతో పాటు వేదపండితులు ఆశీర్వచనం అందించారు.అనంతరం కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ, సాక్షాత్తు సరస్వతి మాత వసంత పంచమి రోజే అవతరించిందన్న విశ్వాసం ఉన్నందున ఈ రోజు అక్షరాభ్యాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. బాసర, వర్గల్, విజయవాడ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లలేని తల్లిదండ్రుల కోసం ఈ కార్యక్రమాన్ని స్థానికంగా పెద్ద ఎత్తున నిర్వహించామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

# కాప్రా సర్కిల్ కార్యాలయంలో డిప్యుటీ కమిషనర్లకు శాలువాలతో సత్కారం

- కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతల





**కాప్రా, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా సర్కిల్ కార్యాలయంలో కాప్రా నూతన డిప్యుటీ కమిషనర్ శ్రీహరి మరియు నాచారం నూతన డిప్యుటీ కమిషనర్ నిత్యానంద్ ను మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు పత్తి కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోటకూర శ్రీకాంత్, దండ్ల మురళి, సింగం కిరణ్, కందుకూరు రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాప్రా డివిజన్ మరియు వంపుగూడ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకులు డిప్యుటీ కమిషనర్ల దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా వీధి దీపాల ఏర్పాటు, రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీ సమస్యలు తదితర మౌలిక వసతులపై వివరంగా చర్చించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.దీనిపై కాప్రా డిప్యుటీ కమిషనర్ శ్రీహరి సానుకూలంగా స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

# పెద్దమందడిలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం





**పెద్దమందడి,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):** 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లతో కలిసి పెద్దమందడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి వివరించారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడి ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని అధికారులు సూచించారు.

# నేలకొండపల్లి బాలుర మైనారిటీ గురుకులంలో అడ్మిషన్లు షురూ





**ఖమ్మం బ్యూరో, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** మహమ్మదీయ కళాశాల క్యాంపస్ లో నిర్వహిస్తున్న తెలంగాణ మైనారిటీ గురుకులాల నేలకొండపల్లి బాలుర పాఠశాల మరియు కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ బి రాంబాబు శుక్రవారం వెల్లడించారు. ఈ మైనారిటీ గురుకులంలో 2026 27 సంవత్సరానికి గాను, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఎం.ఈ.సి & సి.ఈ.సి) గ్రూపులకు అడ్మిషన్లు తీసుకుంటున్నామని తెలిపారు. మైనారిటీ గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సకల సదుపాయాలు, నాణ్యమైన విద్య ప్రమాణాలతో రూపొందించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ గురుకులంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు , అధ్యాపకులతో నాణ్యమైన విద్య పోషకాహారంతో పాటు నిరంతర పర్యవేక్షణలో విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. రాంబాబుతో పాటు విజిలెన్స్ అధికారి కె .సీతారాములు, అబ్దుల్ మలిక్ మీడియా సెక్రెటరీ జమాఅతె ఇస్లామీ హింద్ ఖమ్మం, ఖాసీం, సమ్మద్, చాంద్ పాషా మరియు కాలేజ్ కోఆర్డినేటర్, స్కూల్ కోఆర్డినేటర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల ప్రచారం కొరకు మైనారిటీ గురుకులాల ఔన్నత్యం కోసం విజిలెన్స్ అధికారి కె. సీతారాములు చేత రచించి తయారు చేసిన ఆడియో, వీడియో పాటను విడుదల చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పాల్వంచ బిడ్డ.. ప్రపంచ వేదికపై గర్జన





◆ దావోస్‌లో డాక్టర్ మధుసూదన్ రెడ్డి సరికొత్త చరిత్ర

**ఖమ్మం బ్యూరో, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలోని మారుమూల ప్రాంతమైన పాల్వంచలో ఒక సాధారణ ఉపాధ్యాయునిగా, విద్యావేత్తగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఒక వ్యక్తి, నేడు ప్రపంచ ఆర్థిక వేదిక పై దేశం గర్వించేలా అద్భుతాలు సృష్టిస్తున్నారు. విలిన్ బయో మెడ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి యడమకంటి, స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న 56వ ప్రపంచ ఆర్థిక సదస్సులో దాదాపు రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడుల ఒప్పందాలతో అందరి దృష్టిని ఆకర్షించారు.

కేఎల్ఆర్ సంస్థల నుంచి దావోస్ వరకు..

డాక్టర్ మధుసూదన్ రెడ్డి ప్రస్థానం పాల్వంచలోని ప్రసిద్ధ కేఎల్ఆర్ విద్యా సంస్థల నుంచి ప్రారంభమైంది. తన మామగారు, దివంగత డాక్టర్ కె. లక్ష్మారెడ్డి (కె ఎల్ ఆర్) ఆశయాలకు అనుగుణంగా, ఆ సంస్థల సెక్రటరీగా ఆయన ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. పాల్వంచలోని ఆ మట్టిలో నేర్చుకున్న క్రమశిక్షణ, కార్యదక్షతే నేడు తనను ఈ స్థాయికి చేర్చాయని ఆయన గర్వంగా చెబుతుంటారు. "పాల్వంచలో కేఎల్ఆర్ సంస్థల సెక్రటరీగా నేను నేర్చుకున్న పాఠాలే నేడు దావోస్‌లోని ఈ గ్లోబల్ బోర్డ్‌రూమ్‌లలో నిర్ణయాలు తీసుకోవడానికి నాకు ధైర్యాన్ని ఇచ్చాయి" అని డాక్టర్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

మహారాష్ట్రలో రూ. 2,100 కోట్ల 'ఫార్మా సిటీ'

స్విట్జర్లాండ్‌కు చెందిన 'స్కా గ్రూప్ ఏజీ' ద్వారా మహారాష్ట్ర ప్రభుత్వంతో డాక్టర్ రెడ్డి చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నారు.

నాసిక్‌లో ఇంటిగ్రేటెడ్ ఫార్మా సిటీ: రూ. 2,100 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో (ఎఫ్ డి ఐ) నాసిక్‌లో భారీ ఫార్మా హబ్‌ను నిర్మిస్తున్నారు.

ఉపాధి: ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 4,850 మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

కీలక పాత్ర: ఈ భారీ ప్రాజెక్టులో విలిన్ బయో మెడ్ లిమిటెడ్ ప్రధాన భాగస్వామిగా వ్యవహరించనుంది.

కేరళలో రూ. 100 కోట్ల మెడికల్ హబ్

మెడికల్ డివైజ్ తయారీ రంగంలో కేరళ ప్రభుత్వంతో డాక్టర్ రెడ్డి రూ. 100 కోట్ల ఒప్పందం చేసుకున్నారు. దీని ద్వారా మరో 200 మందికి ఉపాధి లభించనుంది. కేరళ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పి. రాజీవ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

ఖతార్ ప్రభుత్వంతో చర్చలు

అంతర్జాతీయ విస్తరణలో భాగంగా ఖతార్ దేశానికి చెందిన పెట్టుబడిదారులతో కూడా డాక్టర్ రెడ్డి చర్చలు జరిపారు. విలిన్ బయో మెడ్ సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు.

పాల్వంచ గడ్డపై ఒక సామాన్య నేపథ్యం నుంచి మొదలై, నేడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వంటి అగ్రనేతల సమక్షంలో భారీ ఒప్పందాలు కుదుర్చుకునే స్థాయికి ఎదిగిన డాక్టర్ మధుసూదన్ రెడ్డి ప్రస్థానం తెలుగు వారందరికీ స్ఫూర్తిదాయకం.

# గ్రామాల్లో ప్రజలంతా సమానమే – పార్టీలకతీతంగా అభివృద్ధికి కృషి చేద్దాం

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,జనవరి23(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాల్లోని ప్రజలందరూ సమానమేనని, రాజకీయ పార్టీలకతీతంగా పనిచేసి గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.శుక్రవారం వనపర్తి పట్టణ శివారులోని యువత శిక్షణ కేంద్రంలో నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఐదు రోజులుగా వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఖిల్లా ఘణపురం, పెద్దమందడి, కొత్తకోట, మదనాపురం, అమరచింత, ఆత్మకూర్, గోపాల్పేట మండలాలకు చెందిన 133 మంది సర్పంచులకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.శిక్షణకు హాజరైన సర్పంచులందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు.గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి సమస్యలు, వీధిదీపాల ఏర్పాటు, మురుగు కాలువల శుభ్రత, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో వార్డు సభ్యులను భాగస్వాములు చేయాలన్నారు. గ్రామసభలను క్రమం తప్పకుండా నిర్వహించి, సంబంధిత అధికారులందరూ హాజరయ్యేలా చూడాలని తెలిపారు. గ్రామ వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సర్పంచులదేనని పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన భీమా వివరాలను ముందుగానే నమోదు చేయాలని, భూ వివరాల్లో మార్పులు జరిగిన వెంటనే నవీకరణ చేయాలని సూచించారు. లేనిపక్షంలో రైతు భరోసా వంటి పథకాలలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.గ్రామాల్లో మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని, అందుకు తాను ఎమ్మెల్యేగా భవనాల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచులకు గౌరవ వేతనం పెంపు, పదవీకాలం అనంతరం పింఛన్ ఏర్పాటు విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.గ్రామస్థాయిలో కాపలాదారు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని, సర్పంచులుగా గెలిచిన మీరు చేసే సేవలు ప్రజలకు గుర్తుండిపోయేలా ఉండాలని ఆయన సూచించారు.జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానం సరైంది కాదని, పాత విధానంలోనే పథకాన్ని కొనసాగించాలని కోరుతూ గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని సూచించారు. ఆ తీర్మానాలను తనకు అందజేస్తే ఢిల్లీ వరకు తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.మొదటి విడత శిక్షణలో 133 గ్రామపంచాయతీల సర్పంచులు పాల్గొనగా, రెండో విడతలో మిగతా గ్రామాల సర్పంచులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన సర్పంచులకు ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, స్థానిక సంస్థల కలెక్టర్ యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘునాథ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి రాజు, ఆయా మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.





# హస్తం గూటికి చేరిన వారికి హస్తమే వారి నెత్తిన బస్మాసురా హస్తం అవుతుంది..

మాజీ మంత్రి పువ్వాడ..

**ఖమ్మం బ్యూరో, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగరంలో 17,34 డివిజన్ల నందు జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అజయ్ కుమార్ మాట్లాడుతూ పార్టీకి అండగా ఉండాల్సిన సమయంలో మోసం చేసి వెళ్ళిపోయిన వారికి ప్రజలే బుద్ధి చెపుతారని అన్నారు. బిఆర్ఎస్ విడిచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన వారిని అడుగుతున్నా మీరు అధికార పార్టీలోకి పోయారు కదా మీకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలు పేదలకు ఇప్పించే సత్తా ఉందా అని ప్రశ్నించారు. నేను మంత్రిగా సమయంలో ఏంతో మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చాను. ఇప్పుడు ఈ ప్రభుత్వం ద్వారా అందరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని డిమాండ్ చేసారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఖమ్మంలో నేను చేసిన అభివృద్దే తప్ప వేరే కొత్తగా చేసింది ఏమి లేదని ఏద్దేవా చేశారు. ఇప్పుడు ప్రభుత్వంలో మంత్రులు సింగరేణి మరియు ఇతర కాంట్రాక్టుల విషయాలలో వారే పంచాయతీలు పెట్టుకొని విమర్శలు చేసుకుంటున్నారు. ఇంకా వారు ప్రజలకు ఏమి చేస్తారని ప్రశ్నించారు. నా మీద అవాకులు చవాకులు మాట్లాడిన వారికి ప్రజలే బుద్ధి చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,

మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం,మాజీ మార్కెట్ చైర్మన్ గుండాల కృష్ణ,ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ,మాజీ గ్రంథాలయం చైర్మన్ ఖమర్,మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బుల్ కార్పొరేటర్లు మాటేటి నాగేశ్వర రావు,పసుమర్తి రామ్మోహన్,జ్యోతి రెడ్డి,ముక్కాల రాజేష్,మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి,నాయకులు మెంతుల శ్రీశైలం,పల్లా రాజశేఖర్,బండి నవీన్, మందడపు రామకృష్ణ,ఖయ్యుమ్, పాలడుగు పాపారావు,ఎర్రా అప్పారావు,వసంత్,కనకం భద్రయ్య,బోజెండ్ల రామ్మోహన్, మస్తాన్,పాషా,లెలిన్ చౌదరి, షకీనా,మాటేటి కిరణ్,రాంబాబు, మహేందర్,శరత్,లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వల్భాపూర్ గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



◆ లబ్ధిదారులకు ₹74,500 విలువైన చెక్కులు అందజేత

**ఎల్కతుర్తి, జనవరి 23(తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కట్కూరి గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి తిరుపతిరావుకు ₹ 60,000, పంచనేని ప్రశాంత్ రావుకు ₹ 14,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పేదలు, అనారోగ్య సమస్యలు లేదా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టారావు, రత్నాకర్ రావు, ముక్క ఐలయ్య, రామారావు, అంబాల రంజాన్, రఘునాథం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లగ్జరీ బస్సులో దొరికిన రూ.10 వేలు.!



◆ నిజాయితీ చాటిన ఉపాధ్యాయుడు షాకీర్ హుస్సేన్.

**సత్తుపల్లి, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** శుక్రవారం ఉదయం 11 గంటలకు సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న లగ్జరీ ఆర్టీసీ బస్సులో సత్తుపల్లి బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ అయిన షాకీర్ హుస్సేన్ ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సు సీటుపై ఒక పర్సు కనిపించగా, అందులో రూ.10,000 నగదు, ఏటీఎం కార్డులు తదితర ముఖ్యమైన పత్రాలు ఉన్నట్లు గుర్తించారు.

నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా వ్యవహరించిన షాకీర్ హుస్సేన్ వెంటనే ఆ పర్సును బస్సు కండక్టర్‌కు అప్పగించారు. అనంతరం పర్సుకు చెందిన వ్యక్తి సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి తగిన ఆధారాలు చూపించి నగదు, కార్డులు సహా పర్సును స్వీకరించుకోవాలని షాకీర్ హుస్సేన్‌తో పాటు కండక్టర్లు తెలిపారు.

ఈ సందర్భంగా లభించిన నగదును ఎలాంటి ఆశ లేకుండా ఆర్టీసీ అధికారులకు అప్పగించిన ఉపాధ్యాయుడు షాకీర్ హుస్సేన్‌ను ప్రయాణికులు, ప్రజలు మరియు అధికారులు హృదయపూర్వకంగా అభినందించారు.

# మైనారిటీ గురుకుల కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలి




◆ ప్రిన్సిపాల్ శైలజ పిలుపు

**నాచారం, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** పేద మైనారిటీ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకుల విద్యా సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని నాచారం లోని మల్కాజిగిరి మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ కోరారు.ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కరపత్రాలను స్థానిక మైనారిటీ నాయకులతో కలిసి కళాశాల ప్రాంగణంలో ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మైనారిటీ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్యా అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.తమ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యతో పాటు పోటీ పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించడమే గురుకులాల ప్రధాన లక్ష్యమని వివరించారు.గత విద్యా సంవత్సరంలో కళాశాల 92 శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఇద్దరు విద్యార్థినులు వెయ్యి మార్కులకు గాను 993 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే మరో విద్యార్థినికి మెడికల్ విభాగంలో ఉచిత సీటు లభించిందని పేర్కొన్నారు.

మైనారిటీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ గురుకుల కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.*వివరాల కోసం*: 9154365043, 9908444128 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎండీ ఫరీద్, ఎండీ ఇబ్రహీం, సయ్యద్ అబ్దుల్ రహీమ్, సయ్యద్ ఆలంపాషా, నాసిర్ షరీఫ్, సయ్యద్ శౌకత్ అలీ, ఎండీ మహబూబ్ తదితరులతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా వసంత పంచమి వేడుకలు

ఖమ్మం బ్యూరో, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు)

వసంత పంచమి వేడుకలను చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. వసంత పంచమి విశిష్టత గురించి పాఠశాల కరస్పాండెంట్ బోడేపుడి కిరణ్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు బోళ్ల రేణుక, రాధ, శ్రీనివాస్, పార్వతి, త్రివేణి, సుజాత, సుజిత, నాగదుర్గ, చందన, పుల్లారావు, చెరుకుపల్లి కిరణ్, ఝాన్సీ, శైలజ, ప్రశాంతి, శోభ, ఆదిలక్ష్మి, అమరపోయిన సురేష్, భిమల్ పాల్గొన్నారు.

# ఈపీఎఫ్ఓ నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ శ్రీనివాస్

ఖమ్మం బ్యూరో, జనవరి -23 (తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం జిల్లాలోని సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, జిల్లా కార్యాలయం, ఖమ్మం వారు జనవరి 27న (మంగళవారం) ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు “నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని ఖమ్మం మామిళ్ళ గూడెంలోని శ్రీ చైతన్య స్కూల్ వద్ద నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ వై.డి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించబడతాయి అని అన్నారు.

ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించడం, కొత్తగా కవరైన సంస్థల యజమానులకు పరిచయం, ఆన్ లైన్ సేవల వివరాలు, పెన్షనర్ లకు జీవన్ ప్రమాణ, ఇతర సమస్యల పరిష్కారం, ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజనపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ శ్రీనివాస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రంజాన్ మాసంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై నేడు సమావేశం

- జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్

ఖమ్మం బ్యూరో, జనవరి -23 (తెలంగాణ ముచ్చట్లు)

రాబోయే పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జిల్లాలో చేపట్టవలసిన ఏర్పాట్లపై చర్చించుటకు వీలుగా నేడు (జనవరి 24) శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ సదర్లు (ప్రెసిడెంటు / సెక్రటరీ), మైనారిటీ నాయకులు తప్పనిసరిగా హాజరై రంజాన్ మాస ఏర్పాట్లపై సూచనలు అందించాలని ముజాహిద్ ఆ ప్రకటనలో కోరారు.

# హైకోర్టు జడ్జితో సీనియర్ లాయర్ వాగ్వాదం..

న్యూఢిల్లీ, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు)

ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తితో జరిగిన వాగ్వాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ వ్యవహారంలో సీనియర్ న్యాయవాది మహేశ్ తివారీపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. హైకోర్టు ఇచ్చిన ధిక్కార నోటీసులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. నన్నేం చేయగలరని హైకోర్టును పరోక్షంగా ప్రశ్నించేందుకే పిటిషన్ దాఖలు చేసినట్లు కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాలంటే చెప్పవచ్చని, లేకపోతే ధిక్కార ధోరణితో ముందుకు వస్తే తగిన విధంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అయితే న్యాయవాది క్షమాపణలు కోరితే వాటిని సహృదయంతో పరిగణించాలని ఝార్ఖండ్ హైకోర్టుకు సూచించారు.

ఈ వివాదం ఓ విద్యుత్ బిల్లు కేసుతో ప్రారంభమైంది. ఝార్ఖండ్‌కు చెందిన ఓ మహిళకు 1.30 లక్షల మేర బకాయిలు ఉండటంతో అధికారులు విద్యుత్ కనెక్షన్ నిలిపివేశారు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరగా మహిళ తరపున మహేశ్ తివారీ వాదనలు వినిపించారు. కనెక్షన్ పునరుద్ధరణ కోసం 25 వేలు చెల్లించేందుకు సిద్ధమని ఆయన కోర్టుకు తెలియజేశారు. అయితే గత తీర్పుల ప్రకారం కనీసం బకాయిలో సగం మొత్తాన్ని చెల్లించాల్సిందేనని న్యాయమూర్తి పేర్కొన్నారు. చివరకు 50 వేలు చెల్లించేందుకు అంగీకరించడంతో విషయం ఒక దశలో సర్దుబాటు అయ్యింది.

అయితే వాదనలు వినిపించిన తీరు నచ్చకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్‌కు ఈ అంశంపై దృష్టి పెట్టాలని సూచించడంతో మహేశ్ తివారీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తాను తన శైలిలోనే వాదనలు వినిపిస్తానని, ఎవరూ తనను అవమానించేలా వ్యాఖ్యలు చేయొద్దని స్పష్టం చేశారు. కోర్టు అన్యాయం చేస్తోందని మీరు అంటున్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, తాను అలా అనలేదని మహేశ్ వివరణ ఇచ్చారు. అవసరమైతే విచారణ రికార్డును పరిశీలించాలని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం మహేశ్ తివారీకి కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.







# రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలి..

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు

ఖమ్మం బ్యూరో, జనవరి -23(తెలంగాణ ముచ్చట్లు)

నగరంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రజలు సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరారు. మంత్రి వర్యులు, శుక్రవారం ఖమ్మం 53వ డివిజన్ లో 3 కోట్ల 98 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 33 మంది దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రాబోయే తరాలకు ఉపయోగపడే విధంగా నగరంలో రహదారుల విస్తరణ పనులు ప్రజలు ఒప్పుకుంటే చేపడతామని అన్నారు. ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి పనులు పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యతతో నిర్మించాలని అన్నారు.

నగరంలో ప్రజలు ప్లాస్టిక్ వాడటం తగ్గించాలని అన్నారు. మురికి కాల్వలో చెత్త వేయడం ద్వారా నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నగరం పరిశుభ్రంగా ఉంటే మన ఆరోగ్యాలు బాగుంటాయని, మన సంపద పెరుగుతుందని అన్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో నేడు గాలి సరిగాలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆ పరిస్థితి మనకు రావద్దని మంత్రి తెలిపారు. ఖమ్మం జిల్లాకు అవసరమైన విద్య, వైద్యం, జాతీయ రహదారులు, నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందని మంత్రి అన్నారు.

నగరంలోని డివిజన్ లలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులు నిర్మించడంతో పాటు వాటిని సరిగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం అవసరమైన కార్యక్రమాలను జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

*ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ 2 కోట్ల 43 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ను నేడు ఉదయం మంత్రివర్యులు ప్రారంభించారని, దీని వల్ల 7 డివిజన్ల వరకు ప్రజలకు వైద్య సేవలు అందుతాయని అన్నారు. మనం చేస్తున్న అభివృద్ధి పనులకు విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.

రోడ్డు విస్తరణ, లింక్ రోడ్ల నిర్మాణ పనులపై మంత్రివర్యులు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. గాంధీ చౌక్ వద్ద మరో హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తి చేశామని, దీనిని త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ గా ఖమ్మం నగరం అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. 155 కోట్లతో మార్కెట్ యార్డు అభివృద్ధి చేస్తున్నామని, నగరంలో తీగల వంతెన, ఖమ్మం ఖిల్లాకు రోప్ వే నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరానికి అవసరమైన అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ మంత్రివర్యులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అధికారులు విశేష కృషితో అభివృద్ధి పనులను ప్రణాళికా ప్రకారంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ విజేత, ఆర్డీఓ నరసింహా రావు, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల శిక్షణా నోడల్ అధికారి శ్రీరామ్

ఖమ్మం బ్యూరో, జనవరి -23(తెలంగాణ ముచ్చట్లు)





ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని మునిసిపల్ ఎన్నికల శిక్షణా నోడల్ అధికారి కొండపల్లి శ్రీరామ్ అన్నారు.

మునిసిపల్ ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణపై అవగహన కల్పిస్తూ ఎన్నికల విధుల పట్ల శిక్షణా నోడల్ అధికారి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శిక్షణా నోడల్ అధికారి కొండపల్లి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి అధికారి కొత్తగా ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు భావించి జాగ్రత్తగా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించడానికి వీలు లేదని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఈవిఎం యంత్రాలతో జరిగితే, మునిసిపల్ ఎన్నికలు బ్యాలెట్ ద్వారా జరుగనున్నాయి అని, ప్రతి చిన్న అంశాన్ని, అనుమానాలను శిక్షణలో పూర్తి స్థాయిలో విచారించి తెలుసుకోవాలని సూచించారు.

ట్రైనింగ్ హాల్ నుంచి సంపూర్ణ అవగాహనతో బయటకు పోవాలని అన్నారు. మునిసిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలంటే మనకు నిబంధనలపై సంపూర్ణ పట్టు ఉండాలన్నారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులు సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఆర్వో లు ఎన్నికల సమయంలో మేజిస్టీరియల్ అధికారాలు కలిగి ఉంటారన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటిని, గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ ముద్రణ తదితర ఎన్నికల సంబంధ విధులన్నీ అత్యంత జాగ్రత్తతో చేపట్టాలన్నారు. రిజర్వ్ ఉన్న అధికారులు కూడా రిపోర్ట్ చేయాలని అన్నారు. ఆర్వో హ్యాండ్ బుక్ ను పూర్తిగా అవగాహన చేసుకోవాలని, అందులోని నియమ నిబంధనలను తూ. చ. తప్పకుండా పాటించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో చిన్న తప్పుకు ఆస్కారం ఇవ్వొద్దని, ఒక్క చిన్న తప్పు జరిగిన ఎన్నిక అంత ఫెయిల్ అయ్యే ఆస్కారం వుంటుందని, ఎన్నికలు జీరో తప్పులతో, నూటికి నూరు శాతం సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా స్థాయి శిక్షకులు శైలేందర్, నోడల్ అధికారులు, ఆర్ఓ లు, సహాయ ఆర్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే రాగమయి సుడిగాలి పర్యటన.!

- రూ.3 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

సత్తుపల్లి, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):





సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ శుక్రవారం కల్లూరు మున్సిపాలిటీలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా సుమారు రూ.3 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి పనులను ప్రారంభించారు. సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల సహకారంతో నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 5, 6, 11, 16, 17, 19, 20 వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే, డాక్టర్ మట్టా దయానంద్ స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలపై ప్రజలు వినిపించిన అంశాలను గమనించి, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ పర్యటనలో భాగంగా గోపాలకుంట, శాంతినగర్, అంబేద్కర్ నగర్, పుల్లయ్య బంజార్, వచ్చ నాయక్ తండా, ఏకలవ్య నగర్, బోడెమల్లె ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు పూర్తయ్యితే ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సులభమవడంతో పాటు వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి వార్డులో సమానంగా అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రాగమయి పేర్కొన్నారు.


ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌పై అక్రమ ఆస్తుల కేసు

**కాప్రా, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



రంగారెడ్డి జిల్లాలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా (ఎస్ఆర్ఓ-1) పనిచేసి, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న కందాడి మధుసూధన్‌రెడ్డిపై అక్రమ ఆస్తుల కేసు నమోదు చేశారు. ఏసీబీ అధికారులు ఆయన ఆదాయానికి మించి భారీ ఆస్తులు సంపాదించారని గుర్తించారు.

శుక్రవారం మధుసూధన్‌రెడ్డి నివాసం, అలాగే బంధువులు, స్నేహితులు మరియు బినామీలకు చెందిన ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. దర్యాప్తు నిమిత్తం కాప్రా భవానీనగర్‌లో ట్రిప్లెక్స్ భవనం, ఇబ్రహీంపట్నం చింతపల్లిగూడలో ఓపెన్ ప్లాట్, పరిగి మండలం నస్కల్‌లో 27 ఎకరాల వ్యవసాయ భూమి, మంగళ్‌పల్లిలో వాణిజ్య భూమి వంటి స్థిరాస్తులను గుర్తించారు. అదనంగా నస్కల్‌లో స్విమ్మింగ్ పూల్ ఉన్న ఫామ్‌హౌస్, నగదు, బంగారు ఆభరణాలు, మూడు విలాసవంతమైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థిర, చర ఆస్తుల మొత్తం విలువ రూ.7.83 కోట్లకు పైగా అని అధికారులు అంచనా వేశారు.

ఏసీబీ దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది, అవసరమైతే అదనపు స్థలాల్లో సోదాలు కొనసాగుతాయని అన్నారు.

# బండి వెంకటేశ్వర్లుకు మాజీ ఎంపీ నామ పరామర్శ

**ఖమ్మం బ్యూరో, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు)**



చింతకాని మండలం తిరుమలాపురం గ్రామ వాసి, మాజీ సర్పంచ్ బండి రామారావు తండ్రి బండి వెంకటేశ్వర్లు అనారోగ్య కారణంగా ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు ఆసుపత్రికి వెళ్లి వెంకటేశ్వర్లును పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నామ వెంట బీఆర్ఎస్ మంకెన రమేష్, మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో వైభవంగా వసంత పంచమి వేడుకలు

**చిన్నారులకు అక్షరాభ్యాస ఉత్సవం**

**ఖమ్మం బ్యూరో,జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు)**


స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం వసంత పంచమి వేడుకలు సాంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాస ఉత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పండితులు చిన్నారులతో కలిసి సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు మంగళకరంగా నిర్వహించి అనంతరం చిన్నారులకు అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాస క్రతువును జరిపారు. చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి ఈ వేడుకలో పాల్గొనడంతో పాఠశాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ చిన్నారులకు ప్రతి సంవత్సరం వసంత పంచమి వేడుకల సందర్భంగా అక్షరాభ్యాస ఉత్సవాన్ని తమ పాఠశాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పరిసర ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఈ వేడుకల్లో పాల్గొని అక్షరాభ్యాసం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ వసంత పంచమి రోజునే పాఠశాల నూతన సంవత్సర ప్రవేశాలను ప్రారంభించామని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పాఠశాలకు వెన్నుదన్నుగా నిలిచి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాల అభివృద్ధికి

# ప్రభుత్వ ప్రాధాన్యత

- **రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**(ఖమ్మం బ్యూరో, జనవరి -23 (తెలంగాణ ముచ్చట్లు)**



విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

మంత్రివర్యులు, శుక్రవారం ఖమ్మం 4వ డివిజన్ బాలాజీ నగర్ లో 2 కోట్ల 43 లక్షలతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రోగాలతో అనేక ఇబ్బందులతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలతో సిబ్బంది ప్రేమ ఆప్యాయతలతో ప్రవర్తించాలని, మన ప్రవర్తనతో రోగి సగం బాధ నయం అవుతుందని అన్నారు.

ఆసుపత్రి పరిసరాలలో పచ్చని మొక్కలు పెంచాలని, ఆసుపత్రి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వైద్య శాఖకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు అవసరమైన మేర కలెక్టర్, కమీషనర్ నుంచి నిధులు తీసుకొని ఆసుపత్రి చుట్టు పక్కల పరిశుభ్రత, పారిశుధ్యం పాటించాలని అన్నారు. ఆసుపత్రి అవసరాలకు అవసరమైతే ప్రజా ప్రతినిధులు, మంత్రుల నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సిబ్బంది ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్ నందు వైద్య సేవలు కోసం కేటాయించాలని, అవసరమైన నూతన పోస్టులు మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు పంపితే సంబంధిత వాటిపై చర్చించి మంజూరు చేయిస్తానని అన్నారు.

మంచి విద్య, వైద్య అవకాశాలతో ఖమ్మం ప్రశాంత నగరంగా అభివృద్ధి చెందాలని , విద్య, వైద్య రంగాలను రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని అన్నారు. 2 వేల 200 ఇందిరమ్మ ఇళ్లను ఖమ్మం నగరంలో అర్హులైన పేదలకు ఇచ్చామని త్వరలో మరో 2 వేల 500 ఇండ్లు మంజూరుకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వానికి వీలైనంత వరకు పేద ప్రజల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తుందని అన్నారు. 13 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తుందని, పేదలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ అందిస్తున్నామని అన్నారు.

గతంలో తాన మంత్రిగా ఉన్నప్పుడు 6000 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేశానని, వాటిలో పెండింగ్ నిర్మాణాలను కూడా పూర్తి చేసి, రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో నిర్వాసితుల పేదలకు కేటాయించేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఖమ్మంలోనే మార్కెట్ వద్ద రోడ్డుపై నివసిస్తున్న 28 పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించి రోడ్డు విస్తరణ చేశామని మంత్రి తెలిపారు. రోడ్డు విస్తరణలో ఎక్కడైనా భవనాలు కోల్పోతే వారికి పది రెట్లు పరిహారం అందిస్తామని అన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలలో గుడిసెలు వేద్దామని అధికారంలో ఉన్న నాయకులు ప్రయత్నించిన అధికారులు ఒప్పుకోవద్దని మంత్రి స్పష్టం చేసారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2 కోట్ల 43 లక్షలతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ను నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. డివిజన్ ప్రజలకే కాకుండా చుట్టు పక్కల ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు ఉచితంగా అందిస్తామని అన్నారు.



ప్రజలు ప్రతి చిన్న అవసరానికి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని, చిన్న, చిన్న జ్వరం కేసులు, రక్త పరీక్షలు వంటి సేవలు హెల్త్ సెంటర్ వద్ద తీసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. స్థానిక జనాభా పరిధిలో గర్భిణులకు సంబంధించి 100 శాతం ఏ.ఎన్.సి. చెకప్ ఇక్కడి నుంచి జరగాలని కలెక్టర్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు.

ఏ.ఎన్.సి. చెక్ అప్ లతో పాటు ప్రసవాలు, కొత్తగా పుట్టిన శిశువులకు టీకాలు కూడా 100 శాతం ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో జరిగేలా కృషి చేయాలని అన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. మంత్రి సూచనలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నగరంలో అవసరమైన మేర నూతన అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రామారావు, స్థానిక కార్పొరేటర్ డి. జ్యోతి రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# నేరేడ్మెట్‌లో జెండా ఆవిష్కరణ

- **మహిళలకు మహాసభలకు హాజరుకావాలని పిలుపు**

**నేరేడ్మెట్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఏఐపీడబ్ల్యూఏ) 14వ జాతీయ మహాసభలు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్ ఆర్టీసీ కళ్యాణమండపంలో వైభవంగా నిర్వహించనున్నారు.ఈ మహాసభల నేపథ్యంలో నేరేడ్మెట్ ఆర్కేపురం కాలనీలో సంఘం మండల కార్యదర్శి పి. మంగ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతయ్య కాలనీలో మహిళలు జెండాలు ఎగరవేసి జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన బస్సు భవన్ వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో మహిళలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. మహిళల హక్కులు, సమస్యలపై చర్చించే ఈ జాతీయ మహాసభలు ఉద్యమానికి మరింత బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైష్ణవి, లలిత, పద్మ, దీప, శోభ, సత్యవతి, స్నేహలత, దేవమ్మ, స్వర్ణలత, సత్తెమ్మ, ఊర్మిళ, సునీత, విజయలక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్-2026"లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన

**కుషాయిగూడ, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026"లో భాగంగా కుషాయిగూడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమల యాజమాన్యాలు, రవాణా కాంట్రాక్టర్లు, డ్రైవర్లు, కార్మికులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి వినియోగం, అధిక వేగం వల్ల కలిగే ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే అనర్థాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాల్సిన అవసరం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.పరిశ్రమల పరిధిలో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో డ్రైవర్లు మరింత జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యమే ప్రాణనష్టానికి దారి తీస్తుందని పోలీసులు హెచ్చరించారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, డ్రైవర్లు రోడ్డు భద్రతపై మరింత జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు.

# తెలంగాణ జాగృతిలో చేరిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

**హైదరాబాద్, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



సిద్ధిపేట నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్. శ్రీనివాస్ నేతృత్వంలో మిట్టపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు ఉద్యమకారులు తెలంగాణ జాగృతిలో చేరారు. హైదరాబాద్‌లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగా చేరిన నేతలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలతో జాగృతి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై తాము చేరుతున్నామని కొత్త సభ్యులు తెలిపారు.

కార్యక్రమంలో మాట్లాడిన కవిత, గ్రామస్థాయి నుంచి ఉద్యమకారులు జాగృతిలో భాగమవడం సంస్థ బలాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం, మహిళా సాధికారత, తెలంగాణ సంస్కృతి పరిరక్షణ దిశగా జాగృతి కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు జాగృతి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ చేరికలతో సిద్ధిపేట ప్రాంతంలో తెలంగాణ జాగృతి కార్యకలాపాలు మరింత బలోపేతం కానున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# మానవసేవే మాధవసేవ క్యాలెండర్ ఆవిష్కరణ

**మల్కాజ్‌గిరి, జనవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



సేవే లక్ష్యంగా సామాజిక మాధ్యమమైన వాట్సాప్‌ను ఉపయోగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవసేవే మాధవ సేవ గ్రూప్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై శంకర్ ఘనంగా ఆవిష్కరించారు .2016లో కుమ్మరి రాజు తన మిత్రుడు మహమ్మద్ రషీద్‌తో కలిసి రాజకీయాలకు అతీతంగా ఈ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన మిత్రులు, బంధువులను గ్రూప్‌లో చేర్చుకొని, పేదలకు సహాయం, అవసరమైన వారికి తోడ్పాటు, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను గత పది సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు.గ్రూప్ స్థాపనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ దశాబ్ద కాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను ప్రతిబింబించేలా, యువతకు ప్రేరణ కలిగించాలనే ఉద్దేశంతో 2026 సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించారు. ఈ క్యాలెండర్‌ను కుమ్మరి రాజు తన బాల్యమిత్రుడు సాయిబాబా, గ్రూప్ సభ్యులు మహమ్మద్ రషీద్, డాక్టర్ సుధాకర్, జంగాల శ్రీరామ్, యాదవుల సహకారంతో సిద్ధం చేయించారు.శుక్రవారం సాయి నగర్‌లోని సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో, ఆలయ ట్రస్ట్ సభ్యులు మరియు మానవసేవే మాధవసేవ ప్రతినిధుల సమక్షంలో ఎస్సై శంకర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు గ్రూప్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడుతూ, సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై శంకర్, సాయిబాబా, మానవసేవే మాధవసేవ గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు, మహమ్మద్ రషీద్, ఉదారి సత్యనారాయణ యాదవ్, అనిత, సక్కురి భాస్కరరావు, రెడ్డిపల్లి శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.అలాగే సాయిబాబా ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు కె. వెంకటేశం (సీనియర్ ట్రస్టీ),పీ. ప్రభాకర్ (సీనియర్ ట్రస్టీ),ఎం. నాగ సతీష్ (ట్రస్టీ),బి. శ్రీనివాస్ శర్మ (మేనేజర్ - సాయి సమాజ్ చారిటబుల్ ట్రస్ట్) తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in